పవన్ కళ్యాణ్‌కు రామ్‌చరణ్ థాంక్స్

8 లో..

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY


ఇదండీ..కబురు..



సంపుటి : 23 సంచిక : 22 | సోమవారం జనవరి 6 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

# ఏడాదిలో 55,143 ఉద్యోగాలు..

## ఇది దేశంలోనే రికార్డు - సీఎం రేవంత్‌రెడ్డి



కబురు,హైదరాబాద్ జనవరి 5:
వెనుకబడిన రాష్ట్రమైన బిహార్ నుంచి అత్యధికంగా ఐఏఎస్‌లు వస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్లే ఎక్కువ మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ నుంచి సివిల్స్ అభ్యర్థులకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌ను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెప్పారు. దీన్ని ఆర్థిక సాయంగా కాకుండా ప్రోత్సాహకంగా భావించాలన్నారు. వీరంతా సివిల్స్‌లో విజయం సాధించి తెలంగాణకే రావాలని ఆకాంక్షించారు. "తెలంగాణ అధికారులు కేంద్రంలో ఉన్నా రాష్ట్రం కోసం కృషి చేయాలి. మా ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో 55,143 ఉద్యోగాలు ఇచ్చాం. ఇది దేశంలోనే రికార్డు. పదేళ్లలో పేరుకుపోయిన ఖాళీలను భర్తీ చేస్తూ ఇప్పుడు ఉద్యోగాలు ఇస్తున్నాం. దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలబడింది. గతంలో ఎన్నడూ 563 గ్రూప్ 1 ఉద్యోగాలు ఇవ్వలేదు. 14 ఏళ్లుగా వీటి నియామకాలు చేపట్టలేదు. ఇన్ని ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేక అడ్డుకునే కుట్ర చేశారు. గ్రూప్ 1పై కుట్రలన్నీ ఛేదించి పరీక్షలు నిర్వహించాం. ఈ విషయంలో కోర్టులు ప్రభుత్వానికి అండగా నిలిచాయి. మార్చి 31 లోపు ఈ నియామకాలు పూర్తి చేస్తాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.



# ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..

## హామీలు అమలు చేస్తున్నాం - డిప్యూటీ సీఎం భట్టి

కబురు,మొగిలిచర్ల జనవరి 5:
అన్ని వర్గాల ప్రజలు పోరాడితేనే తెలంగాణ వచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లపాటు మోసపోయామన్నారు. వరంగల్ జిల్లా మొగిలిచర్లలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మర్చారని మండిపడ్డారు."ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. రూ.2 లక్షలలోపు ఉన్న రైతు రుణాలను ఒకే విడతలో మాఫీ చేశాం. 3 నెలల్లోనే రైతులు ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేశాం. సాంకేతిక కారణాలతో ఎవరికైనా వర్తించకపోతే వారికి కూడా రుణమాఫీ చేస్తాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేదు. కానీ, ఈ ప్రభుత్వం తొలి ఏడాదే 56 వేల ఉద్యోగాలు ఇచ్చింది. రైతు భరోసాపై ఎంతో దుష్ప్రచారం చేశారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా నిధులు పంపిణీ చేస్తాం. సాగు చేస్తున్న భూమికే రైతు భరోసా ఇస్తాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# నా ఉన్నతికి తెలుగు వెలుగే కారణం



-వెంకయ్యనాయుడు

కబురు,హైదరాబాద్ జనవరి 5:
తెలుగు భాషకు మనమంతా వారసులమని.. దానిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపైనే ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మన మాతృభాషను మనం ప్రేమించకపోతే ఇంకెవరు ప్రేమిస్తారని ఆయన ప్రశ్నించారు. మాతృభాషలో మాట్లాడడం అందరికీ అలవాటుగా మారాలన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు సమాఖ్య మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. తన ఉన్నతికి తెలుగు వెలుగే కారణమన్నారు. దేశంలో గొప్ప పదవుల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నవారేనని చెప్పారు.
"ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఈ సభలను అమెరికాలో ప్రారంభించారు. ఆనాటి సమావేశంలో నేను కూడా పాల్గొన్నాను. దేశ విదేశాల్లో తెలుగువారిని ఒకే వేదికపై తీసుకురావడం హర్షణీయం. కళారూపాలు సామాజిక పునాదులుగా నిలుస్తాయి. కళలు ప్రజలను కార్యోన్ముఖులను చేస్తాయి.

2లో..





సాగు చేయని భూములకు రైతుబంధు..

# రూ. 21 వేల 283 కోట్లు వృథా

కబురు,హైదరాబాద్ జనవరి 5:
గత BRS సర్కార్ సాగు చేయని భూములకు రైతుబంధు నగదు వేసింది. సాగు చేయని భూములకు రైతుబంధు ఇవ్వడంతో ప్రభుత్వానికి మరింత భారం పడింది. ఇందుకు సంబంధించిన లెక్కను ప్రభుత్వం విడుదల చేసింది.2019-20లో 68.93 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చింది. ఇందుకోసం 3 వేల 446.04 కోట్లు చెల్లించింది. అలాగే 2020-21లో 88.80 లక్షల ఎకరాలకు 4 వేల 425.29 కోట్ల రైతుబంధు నిధులు ఖాతాల్లో జమ చేసింది.

2లో..



# ఢిల్లీకి డబ్బుల మూటలు పంపడం కాదు..

## రేవంత్‌ను వదిలిపెట్టం

కబురు,హైదరాబాద్ జనవరి 5:
మోసానికి, నయ వంచనకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రస్తుత, రాష్ట్ర రాజకీయాలపై కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..మోసం,నయ వంచనకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అపహాస్యం చేస్తుంది. కేసీఆర్ చెప్పినట్టే కాంగ్రెస్ మోస పూరిత హామీలు ఇచ్చింది. సోనియా గాంధీ మాటగా రూ.15 వేల రూపాయలు రైతు భరోసా కింద ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

**కేసీఆర్ రైతు బంధుగా..రేవంత్‌రెడ్డి రాబందుగా**

వరంగల్ డిక్లరేషన్ కింద రాహుల్ గాంధీ స్వయంగా రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం రూ.12 వేలకు కుదించి రైతులకు తీరని ద్రోహం చేస్తోంది. దేశంలోనే కేసీఆర్ రైతుబంధుగా..రేవంత్‌రెడ్డి రాబందుగా మిగిలిపోతారు.

మిగతాది 2లో



# సంక్రాంతి రద్దీ.

## మరో 52 అదనపు రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

కబురు,హైదరాబాద్ జనవరి 5:
సంక్రాంతి రద్దీ సందర్భంగా మరో 52 అదనపు రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఆయా ప్రాంతాలకు ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు ఇవి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

# నేడు ఆసిఫాబాద్ లో ఎమ్మెల్సీ కవిత పర్యటన

కబురు,హైదరాబాద్ జనవరి 5:



2లో..

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY

# ఢిల్లీకి డబ్బుల మూటలు పంపడం కాదు..
# రేవంత్‌ను వదలిపెట్టం

మొదటిపేజీ తరువాయి
ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని విస్మరిస్తున్నారు.

**ఓడ దాటేంత వరకు ఓడ మల్లన ..**
ఓడ దాటగా బోడ మల్లన అన్నటుగా కాంగ్రెస్ ప్రభుత్వ నైజం మరోసారి బయట పడింది. సీఎం రేవంత్ రాష్ట్రాన్ని, ప్రభుత్వ ఉద్యోగులను కించ పరిచేలా, చిన్న చూపు చూసేలా మాట్లాడుతున్నారు. పథకాలు హామీల విషయంలో రేవంత్‌వి దివాలాకోరు మాటలు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితే బాగలేదు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేదని రైతులను,మహిళలను,ఓటర్లను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. లక్షా ముప్పై ఎనిమిది వేల కోట్లు ఎక్కడికి పోయాయి. రుణ మాఫీ, రైతు రుణమాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఢిల్లీకి మూటలు పంపుతున్నారు తప్పితే ..రైతుల గురించి పట్టించుకోవడం లేదు. రూ.5,493 కోట్ల రెవెన్యూ సర్‌ప్లేస్‌ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించాం. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్‌సీ, డీఏలు ఎగ్గొట్టేలా రేవంత్ రెడ్డి మాటలు ఉన్నాయి.ప్రతి రైతుకు రూ.17,500 ఎకరాకి ఇచ్చే వరకు రేవంత్‌ను వదిలి పెట్టం.

**రేపు రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరసనలు**
రైతులకు సంఘీ భావంగా రేపు అన్ని జిల్లాల్లో, నియోజక వర్గాల్లో, మండలాల్లో నిరసనలు చేపడుతాం. కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల గండాన్ని తప్పించుకునేందుకే ఎకరానికి రూ. 12 వేలు ఇస్తామని కాంగ్రెస్ డ్రామా ఆడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు భరోసా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బొంద పెట్టె ప్రయత్నం చేస్తోంది' అని కేటీఆర్ ఆరోపించారు.

## సంపాదకీయం

## సాగునీళ్లూ షాక్ కొడతాయా?

"టంగుటూరు మిరియాలు తాటికాయలంత...". తెలుగు నాట ఇదొక సామెత. చేతలు గడప దాటకుండానే మాటల్ని కోటలు దాటించే కోతల రాయుళ్లపై ఇటువంటి సామెతలు చాలానే ఉన్నాయి. ఈ మధ్య ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎడాపెడా విసురుతున్న మాటల ఈటెల్నీ, పలుకుతన్న పద జాలాన్నీ చూస్తుంటే ఈ సామెతలు సరిపోవనిపిస్తున్నది. 'విజన్–2047' పేరుతో ఆయన అట్టహాసంగా ఓ డాక్యుమెంట్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ విజన్ దెబ్బకు ఇంకో ఇరవై మూడేళ్లలో ఏపీ స్టేట్ 'ఏక్ నంబర్ స్టేటస్' చేరుకోనున్నదని ఆ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు. 'ఏక్ నంబర్ స్టేటస్' వస్తున్నప్పుడు స్పెషల్ స్టేటస్ ఎందుకనుకున్నారేమో గానీ, ఆ డాక్యుమెంట్‌లో అటువంటి ప్రస్తావన లేదు.చంద్రబాబు పార్టీకి గానీ, యెల్లో మీడియాకు గానీ ఇలా గొప్పలకు పోవడం, డప్పు వాయించుకోవడం కొత్తేమీ కాదు. కానీ, వారు ప్రగల్భాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. జనం మీదకు తేనె పూసిన కత్తుల్ని విసురుతున్నారు. విష గుళికలకు విజన్ లేబుళ్లు వేస్తున్నారు. కాకుల్ని కొట్టి, గద్దల్ని మేపే సామాజిక దుర్నీతి ఆయన తాజా విజన్ నిండా పరుచుకున్నదనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఆ విజన్ డాక్యుమెంట్ మీద ఇంకా పూర్తి స్థాయి చర్చ ప్రారంభం కాక ముందే, అందులోంచి ఆయన ఓ జలపాత దృశ్యాన్ని బయటకు తీశారు. అరుంధతీ నక్షత్రం మాదిరిగా యెల్లో మీడియా దాన్ని ప్రజలకు చూపెట్టింది. ఈ నక్షత్రానికి ఆయన 'తెలుగుతల్లికి జలహారతి' అని నామకరణం కూడా చేసుకున్నారు.ఈ 'జలహారతి' పథకం తన 'మానస పుత్రిక'ని కూడా బాబు ప్రకటించుకున్నారు. 'విజన్ డాక్యుమెంట్'లో పండంటి రాష్ట్రానికి పది సూత్రాలని చెప్పుకున్నారు. ఆ పది సూత్రాల్లో ఒకటి 'జలభద్రత'. నదుల అనుసంధానం ద్వారా 'జలభద్రత' కల్పించాలన్న ఒక అంశానికి కొనసాగింపుగా ఈ 'జలహారతి' పథకాన్ని ప్రకటించారు. ఈ విజన్‌ను కొంత లోతుగా తరచి చూస్తే, ఇందులో ఎంత ప్రజావ్యతిరేకత దాగి ఉన్నదో, పెత్తందారీతనపు ఫిలాసఫీ ఎలా ఇమిడి ఉన్నదో అవగతమవుతుంది.2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే, నాటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గోదావరి %–% బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. జల వనరుల అధికార్లు,ఇంజినీర్లతో పలు దఫాల సమీక్ష, సాంకేతిక అంశాల పరిశీలన తర్వాత ఒక సమగ్ర నివేదిక (డీపీఆర్)ను జగన్ ప్రభుత్వం తయారు చేసింది. పోలవరం కుడి కాల్వ ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి, ఈ కొత్త ప్రాజెక్టుకు అవసరమైన నీటిని కూడా దాని ద్వారా తరలించి ప్రకాశం బరాజ్‌కు చేర్చాలని నిర్ణయించారు. అక్కడి నుంచి సాగర్ కుడి కాల్వను ఉపయోగించుకొని, బొల్లాపల్లి దగ్గర కొత్తగా నిర్మించే రిజర్వాయర్‌కు చేరుస్తారు. అక్కడి నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ దగ్గరికి చేర్చాలి. ఇదీ ప్రాజెక్టు.ఈ ప్రాజెక్టు వల్ల సాగర్ కుడి కాలువతో పాటు, వెలిగొండ, తెలుగుగంగ, ఎస్సార్ బీసీ, గాలేరు–నగరి తదితర ప్రాజెక్టుల కింద ఉన్న 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం జరుగుతుంది. అదనంగా ఏడున్నర లక్షల ఎకరాల ఆయకట్టు చేరుతుందనీ, 80 లక్షల జనాభాకు తాగునీటి వసతి లభిస్తుందనీ అంచనా వేశారు. ఇందులో నదుల అనుసంధానానికి సంబంధించిన అంశం ఇమిడి ఉన్నందువల్ల అనుసంధానం కేంద్రం బాధ్యత కనుక ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రికి జగన్ మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధాని సూచన మేరకు 'కేంద్ర జలసంఘం' అనుమతి కోసం 2022లోనే రాష్ట్రం ఈ ప్రాజెక్టుపై డీపీఆర్‌ను సమర్పించింది.అదిగో అదే డీపీఆర్‌ను ఇప్పుడు బయటకు తీసి తన మానస పుత్రికగా చంద్రబాబు ప్రకటించుకున్నారు. నామకరణ మహోత్సవాన్ని కూడా జరుపుకున్నారు. అయితే ఇందులో ఒక్క మార్పు మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. పోలవరం కుడి కాలువ సామర్థ్యం పెంచడం ద్వారా బనకచర్లకు కూడా వరద రోజుల్లో రోజుకు రెండు టీఎమ్‌సీల చొప్పున తరలించాలన్నది గత ప్రభుత్వ ప్రతిపాదన. చంద్రబాబు సర్కార్ ఇక్కడ మార్పు చేసింది. పోలవరం ప్రాజెక్టుకు దిగువన తాడిపూడి పాయింట్ దగ్గర ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి, కుడి కాల్వకు సమాంతరంగా మరో కాలువను తవ్వి, నీటిని తరలించాలని ప్రతిపాదించింది.ఎత్తిపోతల పంపుల కోసం, కరెంట్ కోసం అదనపు ఖర్చు. మరో కాలువ తవ్వడానికి భూసేకరణ ఒక ప్రధాన సమస్య. అదనపు ఖర్చు కూడా. జగన్ పథకాన్ని యథాతథంగా కాపీ చేయకుండా ఈ ఒక్క మార్పును ఎందుకు చేసినట్టు? అదనపు ఖర్చు వల్ల అదనపు కమిషన్ లభిస్తుందన్న కండూతి ఒక కారణం కావచ్చు. దీంతోపాటు ఇంకో విమర్శ కూడా వినిపి స్తున్నది.పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 45.72 మీటర్లకు బదులుగా 41.15 మీటర్లకే పరిమితం చేయడానికి బాబు సర్కారు అంగీకరించిందనీ, ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో కూడా నిర్ణయం జరగిందనీ ఇటీవల సాక్షి మీడియాలో ప్రము ఖంగా వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ తాడిపూడి ఎత్తి పోతల నిర్ణయం కూడా దాన్ని నిర్ధారిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వను పరిమితం చేస్తే కుడి కాలువ ఆయకట్టుకే సరిపోను నీటిని అందివ్వలేదనీ, అటువంట ప్పుడు ఇక బనకచర్లకు తరలింపు ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కనుక ప్రాజెక్టు దిగువన కూడా వరద రోజుల్లో ప్రవాహం ఉన్నప్పుడు ఎత్తిపోయడానికి ఈ పథకాన్ని మార్చి ఉండవచ్చని తెలుస్తున్నది. ఇంకొక ముఖ్యమైన మార్పు సిసలైన గేమ్ ఛేంజర్ వంటి అంశం మరొకటి ఉన్నది. నదుల అనుసంధానం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వాలని జగన్ ప్రభుత్వం కోరింది. కానీ, చంద్రబాబు ఆలోచన మరో విధంగా ఉన్నది. ఈ పాజెక్టును ప్రకటించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అసలు విషయాన్ని కొద్దిగా ఆయన బయట పెట్టారు. ప్రాజెక్టు కోసం కేంద్రం నిధులిచ్చే అవకాశం లేదని చెబుతూ – ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సేకరిస్తామని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పదేళ్లదాకా వాటి నిర్వహణను కూడా ప్రైవేట్ వారికే అప్పగిస్తామన్నారు. ఇటీవలే గ్రామీణ రోడ్ల నిర్మాణం %–% నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తామని చంద్రబాబు చెప్పిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ప్రైవేట్ వ్యాపారులు, సేవా దృక్పథంతో రోడ్లేయరు కదా! జనం తోలు వలిచి టోల్ వసూలు చేస్తారు. ఇక సాగునీటి సరఫరాకు కూడా అదే పద్ధతి రాబోతుందన్న మాట.ప్రాజెక్టులు నిర్మించి, నిర్వహించినందుకు ప్రభుత్వమే వారికి సొమ్ము చెల్లిస్తుందని ప్రస్తుతానికి ముఖ్యమంత్రి చెబుతు న్నప్పటికీ అది నమ్మశక్యంగా లేదు. అంతటి ఆర్థిక సామర్థ్యమే ఉంటే, మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా జలయజ్ఞంలోని అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నడుం కట్టేవారు. ఈ ప్రాజెక్టు నదుల అనుసంధానంలో భాగం కనుక కేంద్ర నిధుల కోసం ఒత్తిడి చేసేవారు. పైగా తమ సంఖ్యా బలం మీద ఆధార పడిన ప్రభుత్వాన్ని ముక్కుపిండి ఒప్పించడం ఎంతసేపు? జగన్ సర్కార్ డీపీఆర్‌ను కాపీ కొట్టిన ప్రభుత్వం ఆయన అనుసరించిన వైఖరిని ఎందుకు అనుకరించడం లేదు? ఎందుకంటే, సంపూర్ణ ప్రైవేటీకరణ ఆయన విధానం కనుక. ప్రజలకు ఏదీ ఉచితంగా ఇవ్వడానికి వీల్లేదనీ, ప్రభుత్వ సేవలన్నిటికీ యూజర్ చార్జీలను వసూలు చేయాల్సిందేననీ గతంలోనే తన సిద్ధాంత పత్రాన్ని ఆయన రాసుకున్నారు కనుక. పాతికేళ్ల కింద ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ మాదిరిగానే 'విజన్ 2020'ని చంద్రబాబు ప్రకటించారు. అప్పుడు ఆకాంక్షించిన ఆర్థిక వృద్ధి జరిగిందా? కొందరు బలవంతులు మాత్రం మహాబలసంపన్నులుగా ఎదిగి పోయారు. ఆర్థిక అసమానతలు అమానవీయంగా పెరిగి పోయాయి. ఆ డాక్యు మెంట్‌కు కొనసాగింపే 'విజన్ – 2047'. అంతేగాకుండా, కేంద్ర సర్కార్ ఇప్పటికే ప్రకటించిన 'వికసిత్ భారత్–2047'కు అనుగుణంగా దీన్ని రూపొందించినట్టు స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారు. దొందూ దొందే. మేడ్ ఫర్ ఈచ్ అదర్. చంద్రబాబు ప్రైవేటీకరణ పదజాలంలోకి కొత్త మాటలు వచ్చి చేరుతున్నాయి. గతంలో పీత్రీ మోడల్‌ను తానే ప్రతి పాదించాననీ, ఇప్పుడింకో 'పీ'ని చేర్చి పీఫోర్ ని ప్రతిపా దిస్తున్నాననీ ఆయన చెప్పారు. పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో పీపుల్‌ను కూడా చేర్చారట. 'పీత్రీ'ని అమలు చేసినప్పుడు పబ్లిక్ రంగ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారు. లాభసాటిగా నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ఖాయిలా పట్టించి కోట్ల విలువైన వాటి ఆస్తులతో సహా 54 సంస్థలను పప్పుబెల్లాలకు తన వారికి కట్టబెట్టిన ఉదంతాన్ని మరిచిపోగలమా?

## సాగు చేయని భూములకు రైతుబంధు..
## రూ. 21 వేల 283 కోట్లు వృథా

మొదటిపేజీ తరువాయి
ఇక 2021-2022 సంవత్సరానికి 82.61 లక్షల ఎకరాలకు 4 వేల 130.69 కోట్లు రిలీజ్ చేసింది. 2022-23 ఏడాదికి గానూ 88.12 లక్షల ఎకరాల సాగు చేయని భూమికి 4 వేల 406.02 కోట్ల రైతుబంధు చెల్లించింది. ఇక 2023-24లో అత్యధికంగా 97.51 లక్షల ఎకరాలకు 4 వేల 875.62 కోట్లు రైతుబంధు ఇచ్చింది. మొత్తం ఆరేళ్లలో 21 వేల 283.66 కోట్ల ప్రభుత్వ ధనాన్ని వృథా చేసింది BRS. సాగు చేయని ఈ భూముల్లో ఎక్కువగా గుట్టలు, పుట్టలు, పాడుబడిన భూములు ఎక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## నా ఉన్నతికి
## తెలుగు వెలుగే కారణం

మొదటిపేజీ తరువాయి
వాటిని ముందు తరాలకు అందజేయాల్సిన బాధ్యత మనదే. ప్రతి భాషకు ఓ ప్రత్యేకత ఉంది. తెలుగు మరింత విలక్షణమైంది. అలంకారాలు తెలుగు భాషకు ఎంతో అందాన్ని తెచ్చాయి. జీవిత అర్థాన్ని తెలిపే ఎన్నో సామెతలు తెలుగులో ఉన్నాయి. మాతృభాష.. మన సంస్కృతిని తనలో ఇముడ్చుకుంది. 2012లో ప్రపంచంలో రెండో ఉత్తమ లిపిగా తెలుగు నిలిచింది. మనదేశంలో 450 భాషలు ఉన్నాయి. ఇంగ్లీష్‌పై వ్యామోహంతో కొన్ని భాషలు అంతరించిపోతున్నాయి. భాష ఆగిపోతే.. శ్వాస ఆగిపోయినట్లే. మాతృభాష మర్చిపోతే.. మాతృబంధం విడిచిపోయినట్టే. మన వేషభాషల పట్ల మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. ప్రాథమిక విద్యను తెలుగు భాషలో అందించాలి" అని వెంకయ్యనాయుడు అన్నారు.

## నేడు ఆసిఫాబాద్ లో ఎమ్మెల్సీ కవిత పర్యటన

మొదటిపేజీ తరువాయి
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రేపు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం జైనూర్ మండలంలోని ఆశ్రమ బాలికల పాఠశాలను, ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించనున్నారు. అలాగే వాంకిడి ఆశ్రమ పాఠశాల లో విషాహారం తిని మృత్యువాత పడిన విద్యార్థిని శైలజ కుటుంబాన్ని కవిత పరామర్శించనున్నారు. మధ్యాహ్నం గోలేటిలోని TBGKS కార్యాలయంలో సింగరేణి కార్మికులతో సమావేశమయ్యి, తిరిగి హైదరాబాద్ కు ప్రయాణం అవుతారు.

## ట్రాఫిక్ కష్టాలకు చెక్..
## ఆరాంఘర్- జూపార్క్
## ఫ్లైఓవర్ రేపే ప్రారంభం



హైదరాబాద్: ఆరాంఘర్– జూపార్కు పైవంతెనను ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. సోమవారం సాయంత్రం 4గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్నారు. నగరం నుంచి బెంగళూరు హైవేకు ఉన్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు 4.08 కిలోమీటర్ల పొడవునా దాదాపు రూ.800 కోట్లతో పైవంతెనను బల్దియా నిర్మించింది.హైదరాబాద్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బంది పడటమే కాకుండా కోట్లాది రూపాయల ఇంధనం, విలువైన సమయం వృథా అవుతోంది. నగరంలోని ముఖ్యప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు జీహెచ్ఎంసీ వ్యూహాత్మకరహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పైవంతెనలు, ఆర్వోబీలను నిర్మిస్తూ ట్రాఫిక్ ఇక్కట్లను దూరంచేస్తోంది. ఎస్ఆర్‌డీపీలోలో భాగంగా సుమారు రూ.800 కోట్లతో చేపట్టిన ఆరాంఘర్–జూపార్క్ పైవంతెన పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత నగరంలో రెండో అతిపెద్ద వంతెన.

## మేడ్చల్‌లో ఘోర ప్రమాదం..
## లారీ ఢీకొని ముగ్గురి మృతి




మేడ్చల్: మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా దూసుకొచ్చిన లారీ ముగ్గురిని బలిగొంది. ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి తన భార్య, కుమార్తెను తీసుకెళ్తుండగా.. అదుపు తప్పిన లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటన తర్వాత లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతుల వివరాలు సేకరిస్తున్నారు.

## అటవీ శాఖ సిబ్బందిపై ఆగ్రహం..
## స్థానికుల రాళ్ల దాడి



ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నంలో అటవీ అధికారులపై స్థానికులు రాళ్ల దాడి చేశారు. అక్రమంగా దాచిన కలప కోసం ఇళ్లలో అటవీ అధికారులు సోదాలు చేశారు. ఇళ్లలోకి చొరబడుతున్నారని వారిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో రాళ్లు విసరడంతో అటవీ సిబ్బంది భయంతో పరుగులు తీశారు.ఈ ఘటనలో ఇద్దరు అటవీ శాఖ సిబ్బందికి గాయాలయ్యాయి. అటవీ శాఖ వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో గ్రామంలో పోలీసులు భారీగా మోహరించారు.

## మియాపూర్ లో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య....




హైదరాబాద్ లోని మియాపూర్ లో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్ లోని హఫీజ్ పెట్ లో చోటు చేసుకుంది ఈ ఘటన. శనివారం ( జనవరి 4, 2025 ) చోటు చేసుకున్న ఈ గహట్వానకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.హఫీజ్ పేట్ రైల్వే స్టేషన్ లో శనివారం అర్ధ రాత్రి వ్యక్తి పై సిమెంట్ ఇటుకలతో తల పై మొది హత్య చేసినట్లు తెలిపారు పోలీసులు.స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.హత్య కు గురైన వ్యక్తి వయసు సుమారుగా 30-35 సంవత్సరాలు ఉంటాయన్న తెలిపారు పోలీసులు.క్లూస్ టీం తో వివరాలు సేకరించి నిందితుల కోసం గాలిస్తున్నారు పోలీసులు. హత్యకు గల కారణాలు వంటి ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

## హమాలీలను అక్రమంగా అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదు... దుబాస్ రాములు

కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 5



తమ న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరుతూ సివిల్ సప్లై హామాలీలు చేస్తున్న శాంతియుత నిరవధిక సమ్మెను పోలీసులు భగ్నం చేసి అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హమాలీలకు పెంచిన రేట్లు విడుదల చేయాలని శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసుల చేత అరెస్టు చేయడం విడ్డూరమన్నారు. రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగానే కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గంపల సాయిలు, పుట్టి సాయిలు, చిన్న సాయిలు, భూదవ్వ, హమాలీలు తదితరులు పాల్గొన్నారు

## రైతులకు ఎగ్గొట్టిన రైతు భరోసా ఎప్పుడు అందిస్తారు... బిఆర్ఎస్ నాయకులు నర్సింలు గౌడ్

కబురు న్యూస్,నసురుల్లాబాద్, జనవరి 5



కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రైతులకు ఎగరాకు పదిహేను వేల రూపాయలు రైతు భరోసా పేరుతో ఇస్తామని చెప్పి రైతులకు ఎగగొట్టిన 15వేల రూపాయలను ఎప్పుడూ అందిస్తారో రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింలు గౌడ్ అన్నారు. ఆదివారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో రైతులకు ఎగ్గొట్టిన 15 వేల రూపాయలు అందించాలని కోరుతూ ప్రధాన కూడల్లో పోస్టర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సారంగాపూర్ హత్య కేసును చేదించిన పోలీసులు

కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,జనవరి 05 :



నగర శివారులోని సారంగాపూర్ లో జరిగిన హత్య కేసును పోలీసులు చేదించారు.నిజామాబాద్ సౌత్ రూరల్ సిఐ సురేష్ కుమార్ ఆదివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.ఈ నెల 3 న రాత్రి సమయంలో సారంగాపూర్ గ్రామంలో దుబ్బాక సాయమ్మను అల్లుడు లక్ష్మణ్ ముందుగా లేస్ తో ఉరి వేసి స్పృహ తప్పిన ఆమెపై రోకలి బండతో కొట్టి హత్య చేశాడు.సాయమ్మ కూతురు ఫిర్యాదు చేయడంతో లక్ష్మణ్ పై అనుమానంతో రెండు రోజులుగా గాలించి ఆదివారం సారంగాపూర్ లో పట్టుకున్నట్లు తెలిపారు.30కిపైగా దొంగతనాల కేసులున్న లక్ష్మణ్ పై అత్త సాయమ్మకు సదాభిప్రాయం లేదు.అతన్ని ఇంటికి రావొద్దని ఖరాఖండిగా చెప్పడంతో పాటు నీవు దొంగవని పలుమార్లు అనడంతో ఆమెను హత్య చేయాలని లక్ష్మణ్ నిర్ణయించుకున్నాడని సిఐ తెలిపారు.పథకం ప్రకారమే ఆమె ఒంటరిగా ఉంటున్న ఇంట్లోకి రాత్రివేళ ప్రవేశించి హత్య చేసి ఆమె బంగారు ఆభరణాలను దొంగలించుకపోయారని తెలిపారు.ఎక్కడా పోలీసులు గుర్తించకుండా ఆనవాళ్ళను చెరిపే ప్రయత్నం చేశారని తెలిపారు.లక్ష్మణ్ ను అరెస్టు చేసి బంగారు ఆభరణాలను రికవరి చేశామని,కేసును చేదించడంలో నిజామాబాద్ 6వ టౌన్ ఎస్సై,మోపాల్ ఎస్సై యాదగిరి గౌడ్ లు కష్టపడి పని చేశారని,వారికి ఏసీపీ అభినందించినట్లు సిఐ తెలిపారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి.. జిల్లా నాయకులు ఖలీల్



కబురు న్యూస్, బాన్సువాడ జనవరి,5

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాన్సువాడ మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు బైఠాయించి వంటావార్పు చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు చేశామని, కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు.కార్మికులకు ఈఎస్ఐ ,పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీందర్, కార్మిక సంఘం అధ్యక్షుడు బుజ్జి గారి సాయిలు, రాజు, సాయిలు, వెంకట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని కనుమరుగు చేస్తున్న కేంద్ర సర్కార్

– పునరుద్ధరణ కొరకై జర్నలిస్టులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి...
– మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి...

కబురు న్యూస్,హైదరాబాద్,జనవరి 04 :









ఏళ్ళ తరబడి వర్కింగ్ జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం కనుమరుగు చేయడం సహించరానిదని,వాటి పునరుద్దరణ కోసం జర్నలిస్టులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం రోజున బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన ఆత్మీయ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమ పితామహులు మణికొండ చలపతి రావు కృషితో సాధించుకున్న వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, జర్నలిస్టులను వేజ్ బోర్డు నుండి దూరం చేయడం విచారకరమన్నారు.సమాచార రంగంలో రాకెట్ వేగంతో దూసుకెళ్తున్న ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను కేంద్ర ప్రభుత్వం నేటి వరకు గుర్తించక పోవడం సమంజసం కాదన్నారు.ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు) కృషితోనే దేశంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కొంతమేరకైనా గుర్తింపు లభించిందన్నారు.తెలంగాణలో వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తెలంగాణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ ను ఆయన అభినందించారు.రాష్ట్రంలో వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ సమావేశానికి వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వనం నాగరాజు అధ్యక్షత వహించగా,ప్రధాన కార్యదర్శి నందూరి హరీష్ స్వాగతం పలికారు.టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములుకార్యదర్శులు వి.యాదగిరి,కె.శ్రీకాంత్ రెడ్డి,కోశాధికారి యం.వెంకట్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్, రాష్ట్ర చిన్న,మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరి,హెచ్.యూ.జె.అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్,హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్,టీయూడబ్ల్యూజె మహిళ విభాగం బాధ్యురాలు కల్యాణం రాజేశ్వరిలతో పాటు వీడియో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను పట్టించుకోలేదు

– ఇచ్చిన మాట ప్రకారం 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...
– ప్రజాపాలనతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ...
– కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం...
– విలేకరుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి...

కబురు న్యూస్,నిజామాబాద్ రూరల్,జనవరి 05 :



పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ బీసీలకు చేసింది శూన్యమని,బీసీ రిజర్వేషన్లను 27శాతానికి పరిమితం చేశారని,తాము ఇచ్చిన మాట ప్రకారం 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.ఆదివారం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ,ఎమ్మెల్సీ కవిత బీసీల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని,దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. ప్రజలు అవినీతి పాలనను వద్దనుకొని కాంగ్రెస్ ను గెలిపించారని అన్నారు.కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించడం జరిగిందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం బడ్జెట్ లో రూ.20వేల కోట్లు కేటాయించిందని,ఇళ్లు లేని వారందరికీ ఇళ్లిస్తామని పేర్కొన్నారు.అలాగే ఈనెల 26వ తేదీ నుంచి అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయేతర భూములకు రైతుబంధు ఇవ్వడంతో రూ.21వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని భూపతిరెడ్డి ఆరోపించారు.తమ ప్రభుత్వం పంటలు పండే ఎన్ని ఎకరాలకైనా రైతుభరోసా ఎకరానికి రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. రైతు భరోసా రూ.15వేలకు బదులు రూ.12వేలు ఇవ్వడానికి కారణంగా కేసీఆర్ చేసిన అప్పులే కారణమని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్,బీజేపీలకు లేదన్నారు.కౌలు రైతులకు సైతం ప్రయోజనం కలుగుతుందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పును మోపి వెళ్లిపోయినా తమ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తోందన్నారు.కేసీఆర్ ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు దుర్వినియోగం చేశారని, ఆయన కుటుంబ జైలుకెళ్లడం ఖాయమని భూపతిరెడ్డి అన్నారు.ప్రజల కోసం జైలుకెళ్తానని ప్రగల్భాలు పలికిన కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయమని తెలియడంతో స్టే తెచ్చుకున్నారని విమర్శించారు.బీజేపీ భారతీయ జూటా పార్టీ అని,పసుపు బోర్డు హామీ ఇప్పటికీ అతీగతీ లేదని విమర్శించారు. బీజేపీది రైతు వ్యతిరేక ప్రభుత్వమని,నల్ల చట్టాలను తీసుకొచ్చి ఆరు వేల మందిని పొట్టనపెట్టుకుందన్నారు.రైతు భరోసా వంటి పథకాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.ఈ విలేకరుల సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు అగ్గు భోజన్న,ఎల్లయ్య,అదే ప్రవీణ్ కమార్ తదితరులన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి..

కబురు న్యూస్,బోధన్ జనవరి 05..











బోధన్ డివిజన్ సాలుర మండలంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం సాలూర మండలంలోని సాలంపాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సంఘ భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను దృష్టిలో పెట్టుకొని తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకు కో ఆపరేటివ్ బ్యాంకులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. పదిలక్షల టన్నుల చెరుకు క్రషింగ్ నడిచే చక్కర కర్మాగారాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని చెప్పి మూసి వేసిన ఘనత గత బీఆర్ఎస్ పార్టీ ది అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను దృష్టిలో పెట్టుకుని చేసిన నిజాం చక్కర కర్మాగారంపై ఉన్న బకాయిలు 190కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. రైతులు చెరుకు పంట పండించేందుకు దృష్టి సారించాలని సూచించారు. రైతులు సహకరిస్తే తొందరలో చక్కర కర్మాగారాన్ని తెప్పిస్తామని స్పష్టం చేశారు. ముందుగా సాలూర మండల కేంద్రంలో నూతన గోదాముల ప్రారంభోత్సవం, 13లక్షల 50,000రూపాయలతో సంఘ కార్యాలయం గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బోధన్, సాలూర మండలంలో ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇసుక విక్రయదారులకు హెచ్చరించారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇసుక ధరను నియంత్రించాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సాలూర మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐడిసిఎంఎస్ అధ్యక్షులు తారాచంద్ నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ ఏఎంసీ చైర్ పర్సన్ అంకు సంధ్య దాము, డీసీసీబీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, డీసీఓ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు బ్రహ్మారెడ్డి, జనార్దన్, సీఈఓ లు బస్వంత్ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే ను ఆదర్శంగా తీసుకోవాలి

- రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ...
- కనిపించే దేవత సావిత్రి బాయి...
- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్...

కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 05 :

సావిత్రిబాయి పూలే ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు,మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ అన్నారు.ఆదివారం బీసీ ఉపాధ్యాయ సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో మహిళ ఉపాధ్యాయులు,ఉద్యోగులకు పురస్కారాలు బీసీ టి యు జిల్లా అధ్యక్షులు వినోద్,ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 126 మంది ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి నగర మేయర్ నీతు కిరణ్,డి.ఈఓ అశోక్,బిసిటియు రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ,ఎస్సీ,ఎస్టీ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ,బీసీ కుల గణన చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని,గత ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని,సావిత్రిబాయి పూలే జయంతి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ప్రకటించడం జరిగిందన్నారు.బీసీ గురుకులాల్లో డైట్ చార్జీలు 40 శాతం,కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ దే అన్నారు.ఉపాధ్యాయ సమస్యలు ముఖ్యమంత్రి



దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు.

### బీసీ కులాల్లో పుట్టినందుకు మనం గర్వపడాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మహిళల అభ్యున్నతి కోసం సేవలందించిన కనిపించే దేవత సావిత్రి బాయి పూలే అనీ,మహిళలకు చదువు లేదని గుర్తించి ఆనాడు సావిత్రి బాయి పూలే కు ఒళ్ళో కూర్చోబెట్టుకుని అక్షరాలు దిద్దించిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే అన్నారు.భర్త నుంచి విద్య నేర్చుకుని ఈనాడు ప్రతి మహిళ చదువుకునేలా స్ఫూర్తి నింపిన సేవ మూర్తి సావిత్రి బాయి పూలే అని గుర్తు చేశారు.గతంలో 80 శాతం బాలురు,20శాతం బాలికలు మాత్రమే చదువుకునే వారని,ప్రస్తుతం ఏ విద్యలో అయిన 60 శాతం బాలికలు 40 శాతం బాలురు ఉంటున్నారని,ఇలా మహిళలు ఈరోజు చదువుకుని అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అది మహాత్మా జ్యోతి బాపులే సావిత్రి బాయి పూలే లే అన్నారు.మహిళా శక్తి బలం మహిళలకు పూర్తిగా తెలియదని అది తెలుసుకుంటే ప్రతి ఒక్కరు సావిత్రి బాయి పూలే లా గొప్ప వ్యక్తులు అవుతారని,మహిళలు తలుచుకుంటే ఇంటిని కాదు దేశాన్ని పాలించగలరని,ఉక్కు మహిళ



ఇందిరా గాంధీ దేశానికి ప్రధానిగా సేవలు అందించారని,మాయావతి అతి పెద్ద రాష్ట్రం ఉత్తర ప్రదేశ్ కు రెండు సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారని గుర్తు చేశారు.అవార్డులు బాధ్యతను పెంచుతాయని,అవార్డులు తీసుకున్న ప్రతి మహిళ సావిత్రి బాయి అడుగు జాడల్లో నడుస్తూ,మహిళ విద్య కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు.ఇందూరు గడ్డ కళాకారులకు,కవులకు,యోధులకు పుట్టినిల్లు అని అన్నారు.ప్రతి ఒక్కరూ మీ కోసం జీవిస్తే ఇక్కడే నిలిచి పోతారని,సమాజం కోసం జీవిస్తే చరిత్రలో నిలిచి పోతారని అన్నారు. ఉద్యోగంలో చేరిన ఉద్యోగి,అదే ఉద్యోగంలో రిటైర్డు కావద్దు ఉన్నతంగా ఎదగాలని అన్నారు.సావిత్రి బాయి పూలే అవార్డు తీసుకున్న ప్రతి ఒకరు ఆమె సేవ,త్యాగం పది మందికి అర్థం అయ్యేలా వివరించాలన్నారు. బీసీలు అంటే బ్రిలియంట్ క్లాస్ అని ఎవ్వరూ బీసీలు అని నిరాశ పడోద్దని అన్నారు. నిజామాబాద్ లో పూలే నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయాలి. రెండు ఎకరాల స్థలం కేటాయించాలని అన్నారు. ముఖ్య మంత్రి తో మాట్లాడి పూలే విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ,సావిత్రి బాయి పులే ఉత్తమ అపాధ్యాయురాలు పురస్కారం అందుకోవడం అభినందనీయం అని అన్నారు. సావిత్రి బాయి పూలే పేరును స్మరించుకుంటున్నామంటే వారు



చేసిన సేవలు ఆదర్శనీయం అన్నారు. వారి జీవిత చరిత్రను చూస్తే వారు సమాజానికీ ఎలాంటి సేవలు చేశారో అర్థం అవుతుందన్నారు. వివక్షత ఉన్న ఆ రోజుల్లో విద్య వల్లనే అన్ని సాధించుకోవచ్చని గుర్తించడం జరిగిందన్నారు. సర్వరోగ నివారిణి అయిన విద్య ద్వారానే మహిళ సాధికారత లభిస్తుందని నమ్మి వారు కృషి చేశారన్నారు.విద్య తోనే ఎదైన సాధించ వచ్చని నమ్మిన గొప్ప శక్తి సావిత్రి బాయి పులే అని గుర్తు చేశారు. ఈనాటి మహిళలు చదువుకొని ఉద్యోగాలు సాధించారంటే పురస్కారాలు పొందుతున్నారంటే సావిత్రిబాయి చేసిన కృషి కారణమన్నారు. సాయుధ పోరాటంలో పని చేసిన సాకలి ఐలమ్మ పేరు మీద యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని,కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ సాధికారత కోసం పనిచేస్తుందన్నారు. స్వశక్తితో మహిళలు ఎదిగేలా స్కిల్ యూనివర్శిటీనీ ఏర్పాటు చేశామన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ని కూడా ఏర్పాటు చేసుకున్నాం అన్నారు. మాజీ జడ్పీ చైర్మన్ విఠల్ రావు మాట్లాడుతూ మొట్ట మొదటి ఉపాధ్యాయురాలుగా పని చేసి,పాఠశాలను ఏర్పాటుకు కృషి చేసిన ఘనత సావిత్రి బాయి పూలే దే అన్నారు. గత ప్రభుత్వం పులే 1007 గురుకులాలు ప్రారంభించి,ఒక్కో విద్యార్థికి 1.20 వేలు ఖర్చు చేసిన ఘనత కెసిఆర్ దే అన్నారు. నగర మేయర్ నీతూ కిరణ్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే



జయంతి రోజు మహిళ ఉపాధ్యాయ దినోత్సవం అధికారికంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. బీసీ టియూ ఆధ్వర్యంలో గత 10 సంవత్సరాలుగా మహిళ ఉద్యోగులను,ఉపాధ్యాయులకు నమస్కారాలు అందజేయడం అభినందనీయం అన్నారు. భర్త ద్వారా చదువు నేర్చుకొని స్ఫూర్తిని నింపుడం వల్లనే ఈనాడు ఎందరో మహిళలు చదువు నేర్చుకుని ఉద్యోగాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు అన్నారు. ఎన్నో కష్ట నష్టాలు వచ్చిన అందరి సహకారంతో 100 కు పైగా పాఠశాలలు స్థాపించి,సత్యశోధక్ పాఠశాలను నెలకొల్పడం గొప్ప విషయం అన్నారు. అనంతరం 120 మంది మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయినులు సావిత్రి బాయి పూలే పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ,కార్యనిర్వాహక అధ్యక్షులు కంచరి రవికుమార్,కొట్టాల రామకృష్ణ,అసోసియేటడ్ అధ్యక్షులు మోహన్,గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు,ప్రవీణ్ గౌడ్,యు. విజయ్ కుమార్,మహేందర్,సంజీవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,నుడా చైర్మన్ కేశవ వేణు,పి సి సి డిలీగేట్ శేఖర్ గౌడ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్,నరాల సుధాకర్,కరిపె రవీందర్,రవి కుమార్,రెడ్ క్రాస్ చైర్మన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడిగా ఏనుగు రవీందర్ రెడ్డి ఎన్నిక

కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 5

బాన్సువాడ పట్టణంలోని పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ డైరీ ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు ఏనుగు రవీందర్ రెడ్డిని గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగాలకు



రావలసిన 2017 పే స్కేల్ ఏరియాస్ డబ్బులను వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చి సమస్యను వెంటనే పరిష్కరించాలని చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఏనుగు రవీందర్ రెడ్డి విశ్రాంత ఉద్యోగుల సమస్య



పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు శంకర్, కౌసర్, సిరాజుల్ల, మహమూద్, కిషన్ గౌడ్, నాగనాథ్, సాయన్న, మారుతి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగులో సొమ్ము పోగొట్టుకొన్న యువకుడు ఆత్మహత్య

కబురు న్యూస్,లింగంపేట్, జనవరి 05 :



బెట్టింగ్ యాప్ లో సొమ్ము పోగొట్టుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లింగంపేట మండలం ఐలాపూర్ లో చోటు చేసుకుంది.ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐలాపూర్ కు చెందిన కమ్మరి గంగరాజు(29) లింగంపేటలో భార్య,పిల్లలతో నివాసం ఉంటున్నాడు.శుక్రవారం ఐలాపూర్ లో నివసించే తల్లి వద్దకు వెళ్లాడు.రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు.దీంతో శనివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా గ్రామ సమీపంలోని చెరువు కట్టపై గంగరాజు చెప్పులు లభించడంతో నీటిలో గాలించగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. ఆన్ లైన్ గేమ్లకు అలవాటు పడి రూ.50వేలు పోగొట్టుకొని మనస్థాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, తల్లి ఉన్నట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

## రైతు భరోసా డబ్బులు ఎగగొట్టిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి...నాయకులు మోచి గణేష్

- గ్రామాలలో పోస్టర్లు అతికించి నిరసన తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 5

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకరాకు 15000 రైతు భరోసా ఇస్తామని చెప్పడంతో నమ్మిన రైతులకు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినప్పటికీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం గడిచిన రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలో వేయలేక రైతు భరోసా డబ్బులను ఎగ కొట్టిన



ప్రభుత్వానికి రైతులు తగిన బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మోచి గణేష్ అన్నారు. ఆదివారం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు రైతులను కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని తెలియజేయడానికి పార్టీ ఆధ్వర్యంలో పోస్టర్లను మండలంలోని బోర్లం గ్రామంలో పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం



చేస్తుందని, ప్రజలు రైతులు ఆలోచన చేసే సమయం వచ్చిందని, రైతులను మోసం చేసిన ఏ ప్రభుత్వం నిలబడినట్లు చరిత్రలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, కార్యకర్తలు శివ సూరి, అనిల్,లక్ష్మణ్, రాజ్ కుమార్, దిలీప్,రమేష్, సాయి, హన్మాండ్లు, రజనీకాంత్, రాజశేఖర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కెప్టెన్ హబ్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

కబురు న్యూస్, నిజామాబాద్ స్పోర్ట్స్,జనవరి 05 :



మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ,శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని,సహృద్భావ వాతావరణానికి బాటలు వేస్తాయని,నిజామాబాద్ నగరంలోని కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ ఆధ్వర్యంలో మెన్స్ డబుల్స్ ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 క్రీడా పోటీలు నిర్వహించారు.ఈ టోర్నమెంట్ లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండి 73 జట్లు పాల్గొన్నాయి.కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ నిర్వాహకులు కిరణ్ ఎన్ జిఎస్ సంతోష్ పోటీలను ప్రారంభించారు.అనునిత్యం దైనందిన కార్యకలాపాలలో నిమగ్నమై ఉండే వివిధ వర్గాల వారికి మానసికోల్లాసానికి అందించేందుకు క్రీడలు ఉపకరిస్తాయని అన్నారు. ఈ దిశగా కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ సీనియర్ క్రీడాకారులు పసుల అరవింద్, షాదుల్ల ఆధ్వర్యంలో బాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. నేటి తరం ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ క్రీడలు, వ్యాయామాలు,యోగా వంటి అభిరుచులను అలవర్చుకుంటున్నారని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు.ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ట్రోఫీ తో పాటు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వహణ మల్లన్న,రాజు,శౌరబ్,విజయ్,శ్రీనివాస్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత మాంజాను ఉపయోగిస్తే కఠిన చర్యలు...

కబురు న్యూస్,బోధన్ జనవరి05..

ప్రభుత్వ నిషేధిత చైనా మాంజాను ఉపయోగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్.హెచ్.ఓ. వెంకటనారాయణ హెచ్చిరించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గాలి పటాలతో పాటు పక్షులను ఎగరనిద్దామని చైనా మాంజాతో తలెత్తే అనర్థాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాలి పటాలు ఎగరడం కోసం వినియోగించే మాంజా పూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని చెప్పారు. కావున చైనా మాంజాలు ఉపయోగించొద్దని, గాలి పటాల దుకాణాలలో చైనా మాంజాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



# ప్రజా కోణంలో వార్తలు రాసే పత్రిక నవ తెలంగాణ

– నవ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**కబురు న్యూస్, రామగిరి జనవరి 5**

ప్రజా కోణంలో అణగారిన వర్గాల సమస్యలను ప్రజలకు తెలియచేసే పత్రిక నవ తెలంగాణ అని 2025 నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణలో ఐటి శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం రామగిరి మండల కేంద్రంలోని ఐఎన్టీయూసీ శ్రీపాద భవన్ లో 2025 నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరిస్తూ ఆయన మాట్లాడారు.. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా నిజాయితీగా పనిచేసే పత్రిక నవ తెలంగాణ అని అన్నారు అదేవిధంగా, ప్రజా కోణంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేస్తూ పేద, బడుగు బలహీన వర్గాల సాధక బాధకాలను పత్రికలో ప్రచురిస్తూ, నిరంతరం ప్రజల అభిమానాన్ని చురగొంటున్న పత్రిక అని కొనియాడారు. అలాగే నవతెలంగాణ దినపత్రిక నైతిక విలువలు పాటిస్తూ, ప్రజల అభిమానాన్ని చురుగొంటూ ముందు ముందు కూడా ఇంకా ప్రజా కోణంలో వార్తలు రాస్తూ, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు తోట చంద్రయ్య, ఆరెల్లి కొమురయ్య గౌడ్, చొప్పరి సదానందం బర్ల శ్రీనివాస్, కోట రవీందర్ రెడ్డి, తీగల సమ్మయ్య, ముస్త్యాల శ్రీనివాస్, మడ్డి రాజ్ కుమార్, కొలిపాక సారయ్య, చిందం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేదవారిని ఆదుకోవడమే మనందరి విధి.



**కబురు న్యూస్, రామగిరి జనవరి 5.**


ప్రతి పేదవారిని ఆదుకోవడమే మనందరి విధి అని కమాన్ పూర్ లయన్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి సత్య సాయి సేవ సమితి జిల్లా కన్వీనర్ నూక రమేష్ అన్నారు. ఆదివారం కమాన్ పూర్ మండల కేంద్రంతోపాటు తదితర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ మరియు సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అమృత కళాశాలు అనగా బీదవారికి నెలసరి బియ్యం తదితర వస్తువులను నెల గాసం అందజేశారు. మొదటి ఆదివారం 16 మందికి నిత్యవసర సరుకులు అందజేయడం జరుగుతుంది. సుమారు 22 వేల రూపాయల విలువ గల నిత్యవసర వస్తువులు వేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడు కడుపు ఆకలితో ఉండకుండా మా సాయి శక్తుల వారికి అందజేయడం జరుగుతుందని అన్నారు. అలాగే మరి కొంతమంది బీదవారికి సైతం అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.సత్య సాయి కన్వీనర్ నూక రమేష్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, బుగ్గజి, తాటిపాముల శ్రీనివాస్, కందికట్ల భాస్కర్, , లయన్ అనవేన లక్ష్మీరాజు, లయన్ జబ్బార్ ఖాన్ . తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవ పురస్కారాన్ని అందుకున్న అధ్యాపకురాలు భార్గవి

రాష్ట్ర,జిల్లా స్థాయి ప్రసంసాపత్రాన్ని అందుకున్న అద్యాపకురాలు..

**కబురు న్యూస్,నిజామాబాద్, జనవరి 05 :**






నిజామాబాద్ జిల్లా నాగారంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న జి.భార్గవి జిల్లా స్థాయి ఉత్తమ పురస్కార ప్రశంసా పత్రాన్ని అందుకుంది.ఆదివారం రోజున బీసీ ఉపాధ్యాయ సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఉత్తమ మహిళా అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. ఈనెల మూడవ తేదీన అధ్యాపకురాలు భార్గవి రవీంద్రభారతిలో నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా సావిత్రిబాయి పూలే ప్రతిభ పురస్కార అవార్డుని అందుకుంది. ఈ సందర్భంగా గురుకుల కళాశాలలకు చెందిన అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు భార్గవి మాట్లాడుతూ, పురస్కారాన్ని అందుకున్న నాపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు.

# ముస్లిం,క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుంది

– ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ...

**కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 05 :**






ముస్లిం,క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని నాలెడ్జ్ పార్క్ స్కూల్లో ఆదివారం జరిగిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆంధ్ర ఉమ్మడి రాష్ట్రంలో 4% ముస్లిం రిజర్వేషన్లు తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషించిన ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ ని నాలెడ్జ్ పార్క్ స్కూల్ యాజమాన్యం సన్మానించింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలెడ్జ్ పార్క్ స్కూల్ నుండి చదువుకున్న 11 మంది విద్యార్థులకు 4% రిజర్వేషన్ ద్వారా ఎంబీబీఎస్ లో సీట్లు సాధించారని తెలిపారు.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లలో ముస్లింలకు ప్రస్తుతం కల్పిస్తున్న 4% రిజర్వేషన్లను రద్దు చేసేందుకు జరుగుతున్న కుట్రపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ,కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ రిజర్వేషన్లను రద్దు చేయలేరని,రద్దు చేసే అవకాశంపై అమిత్ షా గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాల్లో 4% ముస్లిం రిజర్వేషన్ల కొనసాగింపుపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ పోరాటాన్ని నేటికీ కోర్టుల్లో పోరాడుతూనే ఉన్నానని అన్నారు. 4% ముస్లిం రిజర్వేషన్లను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని,ఈ రిజర్వేషన్లను కాపాడుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 4% రిజర్వేషన్ల అమలుకు చేసిన పోరాటాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మైనారిటీ పాఠశాలలకు,నివాస భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని,ముస్లిం మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. రిజర్వేషన్ వల్ల వేలాది మంది పేద ముస్లిం మైనారిటీ యువకులు ఇంజనీర్లు,డాక్టర్లుగా మారగలిగారని పేర్కొన్నారు.ఈ ఘనత సాధించి నేటికి 31 ఏళ్లు పూర్తయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు.

# 30 రోజుకు చేరుకున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 05 :**




తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె 30వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ,సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వెంటనే చేయాలని కోరారు ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సాధక బాధకాలను అర్థం చేసుకోవాలని గతంలో మీరు ఇచ్చినటువంటి హామీ ఏ కదా మేము అడిగేది అని ప్రశ్నిస్తున్నారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావంగా నిజామాబాద్ మెదక్ కరీంనగర్ అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ డిఎస్పి మదరం గంగాధర్ సమ్మె శిబిరానికి హాజరై సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని మీయొక్క డిమాండ్ న్యాయమైనది అని మీయొక్క సమస్యల పరిష్కరించడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని తెలియజేయడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గంగామణి కోశాధికారి ప్రసాద్ సాంస్కృతిక కార్యదర్శి బాబు అధ్యక్షులు ప్రభాకర్ ఉద్యోగుల సంఘం నాయకులు రాణి కవిత సత్యనారాయణ సామ్యూల్ గంగాధర్ రాజు అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం.

**కబురు న్యూస్, జమ్మికుంట జనవరి 5**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు భరోసా పసలుకు 7500 ఇస్తానని తీరా అధికారంలోకి వచ్చాక నేడు 6000 ఇస్తానన్నడం సిగ్గుచేటు. ఇల్లందకుంట లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాము. మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం గత వానాకాలం యాసంగి పంటలకు ఎకరాకు పంటకు 7500 ఇస్తానన్న వాగ్దానాన్ని పక్కనపెట్టి 6000 రూపాయలు ఇస్తాను అనడం సిగ్గుచేటు అన్నారు రైతులు మళ్లీ అప్పె చేసుకోవాలనడం సరైనది కాదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని 'భూభారతి-2024' గా పేరు మార్పు చేసింది. గవర్నర్ ఆమోదించిన తరువాత గెజెట్ ప్రకటించాల్సివుంది. ఆతరువాత చట్టానికి రూల్స్ రూపొందించాలి. సాగుదారుల హక్కులు నమోదు చేస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించినప్పటికీ భూభారతి చట్టంలోని 23 సెక్షన్‌లలో ఎక్కడా పేర్కొనలేదు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలుదారులు, మరో 6 లక్షల మంది సాగుదారులు పట్టాదారులు లేకుండా సాగుచేస్తున్నారు. వీరికి సాగు హక్కు కల్పిస్తే ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, పంటల బీమా వర్తిస్తాయి. భూయజమానులతోపాటు, సాగుదారులకు హక్కులు కల్పించాలి. తహశీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్, సిసిఎల్ఎ కార్యాలయాల వద్ద గతంలో జరిగిన లోపాలను సరిచేసే విధంగా చూడాలి. ట్రిబ్యునల్ ఏర్పాటు, గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారుల నియామకానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. సాగుభూములను, సాగేతరభూములను విడివిడిగా రిజిష్టరు తయారు చేయాలి. సాదాబైనామాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9.12.2023 వరకు వచ్చిన దరఖాస్తులను ఆమోదించాలి. అసైన్డ్ భూముల సమస్యలను రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వ భూములు(బంచరాయి, పోడు) సాగుచేస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వరి రూ.500, మొక్కజొన్న రూ.330, కందులు రూ.400, సోయబీన్ రూ.350, పత్తి రూ.475, జొన్నలు రూ.292 పంటలకు బోనస్ ఇవ్వాలి. అలాగే పసుపు రూ.12,000, మిరప రూ.15,000, చెరుకు రూ.4,000, ఎర్రజొన్న రూ.3500 పంటలకు నిర్ణయించిన కనీస మద్దతు ధరలు అమలు చేయాలి. అన్ని పంటలను సివిల్ సప్లయిస్, మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయాలి. ప్రస్తుతం కొనుగోలులో జరుగుతున్న జాప్యాన్ని తొలగించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణ మాఫీలో ఇప్పటికి 60 శాతం మాత్రమే విడుదల చేశారు. ఇంకా దాదాపు 18 లక్షల మంది రుణమాఫీ కొరకు ఎదురు చూస్తున్నారు. 2024-25కు వానాకాలం, యాసింగికి కలిపి రూ.81,477 కోట్లులో రూ.44వేల కోట్లు మాత్రమే పంట రుణాలు ఇచ్చారు. యాసింగి పంటలకు రుణాలివ్వాలి. యాసింగి రైతు భరోసాను సంక్రాంతికి ఇస్తామని చెబుతున్నారు. క్యాబినెట్ కమిటీ జనవరి 5,6,7 తేదీల మధ్య ధరఖాస్తు చేసుకున్న వాస్తవ సాగు రైతులకే రైతుభరోసా వర్తింప చేస్తామని నిర్ణయించారు. ఇప్పటికే వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేశారు. ప్రభుత్వ నిర్ణయం తెలియని రైతులు ధరఖాస్తు చేసుకోవడంలో వైఫల్యం చెందితే వారికి రైతుభరోసా అందదు. అందువల్ల గ్రామ సభలు జరిపి వాస్తవ సాగుదారులను నమోదు చేసి వాస్తవ సాగుదారులందరికి రైతు భరోసా వర్తింప చేయాలి. రైతుబందు వచ్చిన తరువాత విత్తన, ఎరువుల సబ్సిడి రద్దు చేశారు. చివరికి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటి రుణాలు ఇవ్వడం తగ్గించింది. రైతుభరోసా రాకపోవడం వలన అధిక వడ్డీకి ప్రైవేట్ రుణాలు తెచ్చి వ్యవసాయం చేస్తున్నారు. ఫసల్ బీమాతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకానికి ప్రణాళిక రూపొంచాలి అన్నారు.

# బేడ బుడగ జంగాల కులస్తులకు . శుభకార్యాలకు . సమావేశాలకు భూమి కేటాయించాలని వినతి

**కబురు న్యూస్, జమ్మికుంట జనవరి 5**



హుస్నాబాద్ లో బీసీ సంక్షేమ. రవాణా శాఖ మంత్రి. పొన్నం ప్రభాకర్ ని హుస్నాబాద్ లో కలిసి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 28 వేల కుటుంబాలు మా బేడ బుడగ జంగాల కులస్తులు ఉన్నారని. శుభకార్యాలు. సమావేశాలు. సభలు నిర్వహించుకోవడం కొరకు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో 1000 గజాల స్థలం కేటాయించి. కమ్యూనిటీ హాలు నిర్మించి ఇవ్వాల్సిందిగా. మంత్రి పొన్నం ప్రభాకర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సానుకూలంగా స్పందించిన మంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తూ. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బేడ బుడగ జంగంబి జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు. గౌరవ అధ్యక్షులు తూర్పాటి లింగయ్య. కార్యవర్గ సభ్యులు చింతల అంజి. తదితరులు పాల్గొన్నారు.

# బాదితునికి 10వేల ఆర్థిక సాయం అందజేత

- కిడ్నీలు చెడిపోయి మంచానికే పరిమితమైన సమీర్
- మా కొడుకుకి ప్రాణభిక్ష పెట్టండి అంటూ వేడుకుంటున్న నిరుపేద తల్లిదండ్రులు

**కబురు న్యూస్, వేములవాడ జనవరి 5**

వేములవాడ పట్టణం, నిరుపేద కుటుంబానికి చెందిన నజుమా నజీర్ దంపతులు కూలీపని చేస్తూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించు కుంటున్న క్రమంలో నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. వీరి కుమారుడు సమీర్ వేములవాడ పట్టణంలో తన బాల్యం నుంచి పేపర్, పాలు వేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. ఇప్పుడు సమీరుకు లిరెండు కిడ్నీలు చెడిపోయి వైద్యం కోసం దాదాపు 12 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో కన్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు సమీర్ వైద్యానికి మానవత్వంతో మీ వంతు సాయం అందించ



మని కోరడంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు మరియూ ఇతర వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేయగా దాతలు స్పందించి 9498 రూపాయలు అందించ డంతో ఆదివారం రోజున తండ్రి నజీరుకు10వేల రూపాయల చెక్కు అందజేయడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు. భాదితుని తండ్రి నజీర్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా దాతల నుండి విరాళంగా సేకరించి మా అబ్బాయి ఆరోగ్యం బాగుపడలని 10వేల రూపాయల సాయం అందించి నందులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్టు సభ్యులు గొంగళ్ళ రవికుమార్ మాట్లాడుతూ దాతల సహకారంతో ట్రస్టు ద్వారా గత కరోనా కాలం నుండి అన్నార్తులకు, పేదలకు అన్నదాన, సేవా కార్యక్రమాలు నిర్వహించ డం జరుగుతుందని, ఆపత్తులో ఉన్నవారికి మనవంత సహకారం అందిద్దాం అని వాట్సాఫ్ గ్రూపులలో కొరగానే దాతలు స్పందించి విరాళాలు అందించడం హర్షించదగ్గ విషయమని,దాతలు అందించిన ఆమొత్తం తీసుకెళ్లి భాదితునికి అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, నాగుల చంద్రశేఖర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పొలాస రాజేందర్, తోట రాజు, సగ్గు రాహుల్ సిన్నన్, వొడ్యాల సందీప్, అక్కనపల్లి పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

# 11వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ స్టేట్ ఛాంపియన్షిప్ పోటీలు

### కాంస్య పథకం సాధించిన 8వ కాలనీ కి చెందిన రాధ

**కబురు న్యూస్, రామగిరి జనవరి 5.**

ఐదు కిలోమీటర్ల నడక పోటీలో కాంస్య పతకం పొందిన 8వ కాలనీకి చెందిన కాంటేవాడ రాధ హైదరాబాద్ లోని గచ్చిబౌలి జిఎంసి బాలయోగి స్టేడియంలో జరుగుచున్న 11వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ స్టేట్ ఛాంపియన్షిప్ పోటీలలో ఐదు కిలోమీటర్ల నడక పోటీ మహిళల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలో పెద్దపల్లి జిల్లా తరపున పాల్గొన్న 8వ కాలనీకి చెందిన కాంటేవాడా రాధ (48) తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం పొందింది. ఐదు సంవత్సరాల నుండి అథ్లెటిక్ గా





రాణిస్తున్న రాధా మాట్లాడుతూ తన భర్త సింగరేణి ఆర్జీ3 ఓసీ1 ఉద్యోగి కాంటివాడ బుగ్గాజి ప్రోత్సహంతో గత రెండు సంవత్సరాల నుండి రాష్ట్రస్థాయి నుండి జాతీయస్థాయి వరకు అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటున్నానని తనను ప్రోత్సహిస్తూ అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.ప్రభు కుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షకార్యదర్శులు గజెళ్ళి పురుషోత్తం, కళ్లెం మహేందర్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కోరిన కోర్కెలు తీర్చే మొలంగూర్ మల్లంగ్ షావలి...

- కుల మతాలకు అతీతంగ మొక్కుల చెల్లింపు...
- కాకతీయు, నైజాం నాటి నుండి నేటి వరకు కోటపై వెలుగుతున్న దీపం...
- మొక్కులు చెల్లించుకుంటున్న హిందు, ముస్లింలు..
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి....
- ఖిల్లా ను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి..

**కబురు న్యూస్, శంకరపట్నం: జనవరి 5**

కోరిన కోర్కెలు తీర్చి కొంగు బంగారాన్ని ప్రసాదించే మల్లం షావలి దర్గా కుల మతాలకు అతీతంగా హిందూ ముస్లింలు దర్గాలో మొక్కులు చెల్లించుకుని ఖిల్లా పై జ్యోతిని వెలిగించడం నాటి కాకతీయుల కాలము నుండి నేటి వరకు కొనసాగుతూనే ఉంది. మొలంగూర్ ఖిల్లా, కరీంనగర్ జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరం, వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలకు 35 కిలోమీటర్ల దూరంలో, కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో గల ఖిల్లా కు కాకతీయుల నాటి నుండి ఓ ప్రత్యేకత సంతరించుకుంది. నాడు కాకతీయుల, నైజాం పాలకుల కాలంలో రాజులు ఖిల్లా పై కోటలు నిర్మాణం చేసుకొని ఇక్కడి నుండి తెలంగాణ రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ కు, కాకతీయ రాజులు వరంగల్ కోటకు, మొలంగూర్ జిల్లాను అనుసంధానంగా ఏర్పాటు చేసుకొని స్థావరాన్ని నెలకొల్పి, నాటి కాకతీయుల నైజాం కాలంలో మొలంగూర్ ఖిల్లా పైన విశాలమైన ప్రదేశం ఉండడంతో కోటలు నిర్మాణం చేసుకొని, ఇక్కడ నుండి పాలనను కూడా కొనసాగించినట్లు పూర్వీకులు చెప్పుచున్నారు. నాటి కాలం నుండి మొలంగూర్ గుట్ట కింద గల మల్లంగ్ షావలి దర్గా లో మల్లం షావలి సమాధికి, హిందూ ముస్లింలు అనే తేడా లేకుండా సోదర భావంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుండి, తమిళనాడు, మహారాష్ట్ర చెందిన హిందూ, ముస్లింలు ప్రతి



మొహరం పండుగకు నిర్వహించే మొహరం. ఉర్సు జాతరకు

హిందూ, ముస్లింలు దర్గా ఉర్సును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి ఒకరోజు దర్గా దర్శనంలోకి హిందూ ముస్లింల మహిళలకు మాత్రమే దర్శనం కోసం దర్శలోనికి ప్రవేశం. ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం దర్గా విశేషం. ఖిల్లా పైన హిందువుల ఆరాధ్య దైవమైన ఆంజనేయ స్వామి అడుగులు, ఆంజనేయ స్వామి రూపాలను నాటి కాకతీయుల కాలంలోనే చెక్కడ విశేషం. కిల్లా పైన నాటి కాకతీయుల కాలంలో ఏర్పాటు చేసిన దీపం. నేటికీ హిందూ, ముస్లింలు తమ కోరిన కోర్కెలు తీర్చడంతో దర్గా లో మొక్కులు చెల్లించుకుని పైన ఏర్పాటుచేసిన తెలంగాణ భాషలోని రోళ్లలో, నూనెను పోసి దీపాన్ని వెలిగించడం నేటికీ భక్తులు వారి వారి మొక్కులను దీపం పెట్టి చెల్లించుకోవడం జరుగుతుంది. ఈ దీపం పెట్టే విధానాన్ని కాకతీయుల కాలము నుండి మొలంగూర్ గ్రామంలో గల మంగలి కులస్తులు నిర్వహించడం జరుగుతుంది. మంగలి కులస్తులు భక్తుల మొక్కుల మేరకు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు, నిర్వహించి, గుట్ట పైన గల హనుమాన్ విగ్రహానికి కూడా పూజలు చేసి, అనంతరం మగ్రిబ్ నమాజ్, అంటే చీకటి పడే సమయంలో ముస్లింల ప్రార్థన మందిరమైన మసదులో నమాజ్ అనంతరం. మొక్కులు చెల్లించుకునే భక్తులు, మంగలి కులస్తులు, గుట్ట పైన గల జ్యోతిని నూనె పోసి వెలిగించడం నేటికీ సాంప్రదాయంగా పాటించడం ప్రత్యేక విశేషం. కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బాధ్యతలు స్వీకరించిన అప్పటి కరీంనగర్ పోలీస్ కమిషనర్, మొలంగూర్ ఖిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రెక్కింగ్, పైకి ఎక్కి పూర్తి పరిసరాలను పరిశీలించి, జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, అప్పటి కరీంనగర్ కమిషనర్, నేడు కలెక్టర్ శశాంక, సిపి కమలహాసన్ రెడ్డి, ఖిల్లా పరిసరాలకు మంత్రముగ్ధులై, జిల్లా సందర్శకులకు ఖిల్లా పైకి వెళ్లడానికి హనుమాన్ పాదాల వద్ద ప్రమాదం పొంచి ఉందని గమనించి, తాజా మాజీ సర్పంచ్ మోరె అనూష శ్రీనివాస్, ఆధ్వర్యంలో భక్తులు, సందర్శకులు, ఖిల్లా పైకి సులువుగా వెళ్లేందుకు రక్షణ కవచాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మొలంగూర్ ను ఖిల్లా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, తాజా మాజీ సర్పంచ్ మోరె అనూష శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్, రాష్ట్ర కేంద్ర పర్యాటక శాఖ అధికారులకు పాలకులకు వినతి పత్రాలను సమర్పించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి కరీంనగర్ ముద్దుబిడ్డ పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ మండలం పచ్చునూరు ముద్దుబిడ్డ మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని, మొలంగూర్ ఖిల్లా పర్యాటక కేంద్రంగా ప్రకటించి నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలని, గ్రామ మండల ప్రజలు కోరుచున్నారు.

# పలు వేడుకల్లో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**కబురు న్యూస్, రామగిరి జనవరి 5.**





రామగిరి మండలం పన్నూర్ తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ ఆధ్వర్యంలో రామగిరి మండల కాంగ్రెస్ యూత్ నాయకుడు మట్ట రాజకుమార్ కుమార్ జన్మదిన వేడుకల్లో పాల్గొని వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం లద్నాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్జి త్రీ ఓసిపి 2 పిట్ సెక్రెటరీ రామిండ్ల లత - మనోహర్ దంపతులకు 20 వ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియచేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎక్కటి రఘుపాల్ రెడ్డి నియామకం..

- నియామక పత్రం అందజేసిన కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు...

**కబురు న్యూస్,వీణవంక, జనవరి 5.**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మండల అధ్యక్షులు నియామకాన్ని చేపట్టింది. నియామకంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సారధ్యంలో రాష్ట్ర కమిటీ కోరిక మేరకు వీణవంక మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎక్కటి రఘుపాల్ రెడ్డిని నియమించగా,ఆదివారం హుజురాబాద్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు,ఎక్కటి రఘుపాల్ రెడ్డికి ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి నియమకానికి సహకరించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో మా వంతు కృషిచేసి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.వీణవంక మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతూ.. శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు.

# బి. ఉమ ఉద్యోగం నుండి విరమణ పొందారు. వీరి కి డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ శాఖ అభినందన

**కబురు న్యూస్, జమ్మికుంట జనవరి 5**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం లోని కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ గా పని చేస్తూ 31-12-2024 రోజున ఉద్యోగం నుండి విరమణ పొందారు. వీరి ఉద్యోగ విరమణ సందర్భంగా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జమ్మికుంట మండల శాఖ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్యా రంగాన్ని ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని , ఇది భవిష్యత్తు తరానికి తీవ్ర నష్టం కలుగుతుందని అన్నాడు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా విద్యా రంగానికి బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయిస్తోందని ప్రభుత్వం కనీసం 20% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేసి పీఆర్సీ వెంటనే అమలు చేయాలని అన్నారు. రిటైర్మెంట్ ఐన వారికి ప్రభుత్వం నుండి వచ్చే బెన్‌ఫిట్స్ సంవత్సరాల తరబడి అందట్లేదని , రిటైర్మెంట్ తరువాత చాలా మందికి ఆర్థిక అవసరాలు , అనారోగ్య సమస్యలు ఉంటాయని , ఈ వయసులోనే ఆర్థిక స్వావలంబన అవసరమని కాబట్టి రిటైర్మెంట్ ఐనవారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ తొందరగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాజిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న సప్లిమెంటరీ బిల్స్, మెడికల్ రీయింబర్స్మెంట్ బిల్స్ వెంటనే విడుదల చేయాలని సర్వ శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎ. శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. ఈశ్వర్ రెడ్డి , రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కె. నారాయణ రెడ్డి , రాష్ట్ర పూర్వ కార్యదర్శి కె. చంద్రమౌళి , జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి , జిల్లా ప్రధాన కార్యదర్శి టి. తిరుపతి జిల్లా పూర్వ అధ్యక్షులు ఎ. సంజీవరెడ్డి , జిల్లా కార్యదర్శి ఎ శ్రీనివాస్ జమ్మికుంట , ఇల్లందకుంట మండలాల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు జమ్మికుంట మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# గుండారం రిజర్వాయర్ ను మినీ ట్యాంక్ బండ్ గా మార్చండి.

- మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం సమర్పించిన గుండారం ప్రజలు.

**కబురు న్యూస్, రామగిరి జనవరి 5.**



కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామ శివారులో గల రిజర్వాయర్ ను మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు తాజా మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఆదివారం కమాన్ పూర్ వచ్చిన సందర్భంగా సమర్పించారు. ఈ రిజర్వాయర్ నాలుగు మండలాలకు కమాన్ పూర్ రామగిరి ముత్తారం మంథని మండలాలకు సాగునీరు అందించే వర ప్రధానిగా విరజిల్లుతుంది. ఎంతో ప్రాధాన్యత గల గుండారం రిజర్వాయర్ను మినీ ట్యాంక్ బండ్ గా మారిస్తే సింగరేణి ప్రాంతమైన సెంటినరీ కాలనీ కలవచర్ల గుండారం కమాన్ పూర్ జూలపల్లి పేరా పల్లి రొంపిగుంట తదితర గ్రామాల ప్రజలకు సేద తీర్చుకునేందుకు బాగుంటుందని గ్రామ ప్రజలు కోరుతున్నారు. దీన్ని ట్యాంక్ బండ్ గా మారిస్తే పర్యాటకులకు సైతం ఆకర్షణగా నిలుస్తుందని అలాగే ప్రక్కన గౌరిగుండం ఉండడంతో ఈ రెండు ప్రాంతాలకు ప్రజలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. కాగా సింగరేణి సంస్థ ద్వారా ఈ నిధులు కేటాయించాలని లేక పర్యాటక శాఖ ద్వారా నైనా నిధులు కేటాయించాలని అవినీతిపత్రంలో కోరారు. కాగా గ్రామ మా జి సర్పంచ్ ఆకుల ఓదెలు తోపాటు తాజా మాజీ ఉపసర్పంచ్ రాచకొండ చంద్రమౌళి, మాజీ సర్పంచులు ఆడవాళ్ళ చంద్రయ్య ,పిడుగు నరసయ్య, గుండారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్, ఆకుల రాజయ్య, వడ్లకొండ మల్లేష్ ,మతిన్ ఖాన్, ఎల్లయ్య కొమురయ్య, గాదేశంకరి, రాచకొండ శ్రీనివాస్, వి ఎస్ ఎస్ రాజేష్, తదితరులు సంతకాలు పెట్టి మంత్రి శ్రీధర్ బాబుకు గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల ఓదెల ద్వారా అందజేయడం జరిగింది.

# ఐఎన్టీయూసీ ఆర్జి 3 ఏరియా క్యాలెండర్ ను ఆవిష్కరించిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కబురు న్యూస్, రామగిరి జనవరి 5.**



సెంటినరీ కాలనీలో ఐఎన్టీయూసీ ఆర్జి 3 ఏరియా క్యాలెండర్ ను ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు ఇండస్ట్రియల్ మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025 సంవత్సరంలో అందరు కూడా ఆయురారోగ్యాలతోని ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ సంతోషంగా ఉండాలని, కొత్త బావులతోపాటు నూతన రిక్రూట్మెంట్ తో యువతకు ఉద్యోగాలు వచ్చే విధంగా, అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతన సవరణ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కార్యదర్శి ఎల్లంకి రామారావు, బ్రాంచ్ కార్యదర్శులు సత్త్రం సమ్మయ్య, నరేడ్ల శ్రీనివాసరావు, ఫిట్ కార్యదర్శులు రామీల మనోహర్, మందల కొమురయ్య, బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శులు పివి గౌడ్, సందెల కుమార్, ఫిట్ కార్యదర్శి సర్వన్, గిరవైన కొమురయ్య, వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పత్రికలతోనే ప్రజాస్వామ్యం మనుగడ...

- ప్రజాహితమే పాత్రికేయుల లక్ష్యం కావాలి..
- అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు.మ్
- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...



**కబురు న్యూస్, శంకరపట్నం జనవరి 5**
ప్రజాస్వామ్యం పత్రికలతోనే మనుగడ సాధిస్తున్నదని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలోని శ్రీతాపాల నరసింహస్వామి దేవస్థానం ఫంక్షన్ హాల్ లో తిమ్మాపూర్ మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభం లాంటివని, ఎప్పటికప్పుడు పత్రికలు ప్రజలను జాగృతపర్చడం వల్లనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందన్నారు. స్వాతంత్రోద్యమంలో పత్రికలు పోషించిన పాత్ర అమోఘనీయమైనదని ఆయన శ్లాఘించారు. ఈ నేపథ్యంలో పత్రికలు మరింత బాధ్యతగా,విశ్వసనీయతను చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన పత్రికలు కబంధ హస్తాల్లో చిక్కుకోవడం దురదృష్టకర పరిణామమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పాత్రికేయుల చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా, పాత్రికేయుల సంధానకర్తలు లుగా వ్యవహరిస్తూ తమవంతు బాధ్యతలు పోషిస్తున్నాయని ఆయన కొనియాడారు.ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబు దారీతనం పెరిగి సమర్థవంతమైన పరిపాలన అందించడానికి ప్రభుత్వాలకు పత్రికలు, పాత్రికేయుల తోడ్పడాలని ఆయన కోరారు. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధుల తప్పిదాలను ఎప్పటికప్పుడుఎత్తిచూపుతో నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు అందించాలని ఆయన కోరారు. రాజకీయ పార్టీలు, సంఘాల్లో అభిప్రాయ భేదాలు ఉండడం సహజమే అయినప్పటికీ జర్నలిస్టుల యూనియన్ లో ఉన్న వారు విభేదాలను విడనాడే జర్నలిస్టుల ఐక్యత, హక్కుల సాధన కోసమే కాకుండా వారి సంక్షేమం కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలు ఇప్పించే విషయంలో జాప్యానికి ప్రభుత్వ ఆంక్షలే అవరోధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టు సంఘం నాయకులు ,జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు

## గురుకుల ప్రవేశానికి 4వ తరగతి విద్యార్థులు ఆధునిక దర్శిని లో ఉచితంగా అప్లై చేసుకోండి...

- యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ్ రెడ్డి..

**కబురు న్యూస్, వీణవంక, జనవరి 5.**



వీణవంక మండల కేంద్రంలోని విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర గురుకుల( వి-టిజి)సెట్ 2025-26 విద్యా సంవత్సరానికి ఎంట్రన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ఎస్సీ, బిసి, ఎస్టి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కావున యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి ఆధునిక గ్రామదర్శిని కంప్యూటర్ సెంటర్ లో 5వ తరగతి ప్రవేశ పరీక్ష కి సంబంధించిన ఆన్లైన్ ఉచితంగా అప్లై చేయడం జరుగుతుంది. కావున విద్యార్థులు గమనించి అప్లై చేసుకోగలరని, యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ్ రెడ్డి మాట్లాడుతూ..దరఖాస్తు చివరి తేదీ ఫిబ్రవరి 1, ఈ పరీక్ష ఫిబ్రవరి 23 తేదీన నిర్వహిస్తారు.ఈ ప్రవేశ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత హాస్టల్ వసతి, మంచి ప్రమాణాలతో ఉన్నత విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందని, విద్యార్థులు సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## కోలేటి కుటుంబానికి మంత్రి పరామర్శ..!



**కబురు న్యూస్, రామగిరి జనవరి 5:**
కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన కమాన్ పూర్ మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు కోలేటి మారుతి తల్లి సుశీలమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఐ. టి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం మారుతితో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతకు ముందు స్వర్గీయ సుశీలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

## నిరుపేద మృతురాలి కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థిక విరాళం..

- అమ్మ ఫౌండేషన్. మల్లారెడ్డిపల్లి..

**కబురు న్యూస్, వీణవంక, జనవరి 5.**
వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన చెల్పూరి లక్ష్మి (75) అనారోగ్యంతో జనవరి 4 శనివారం మరణించగా,ఇట్టి విషయాన్ని అమ్మ ఫౌండేషన్మల్లారెడ్డిపల్లి వారికి చల్లూరు గడ్డం కుమారస్వామిగౌడ్ ఫోన్ ద్వారా వారి కుటుంబ దీనమైన పరిస్థితిని తెలియజేయగా, ఆదివారం అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో 5000/- రూపాయలు అంత్యక్రియల ఖర్చుల కొరకు మృతురాలి కుటుంబానికి అందజేసినారు. ఈ కార్యక్రమంలోఅమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక, అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్,, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, సభ్యులు గడ్డం కుమారస్వామి గౌడ్, తాండ్ర లక్ష్మణ్, ఎలబాక నరేష్, పరిపూర్ణచారి, మొగిలి, ప్రకాష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి శ్రీధర్ బాబు కు అంబీరు శ్రీను ఆత్మీయ సత్కారం..!



**కబురు న్యూస్, రామగిరి, జనవరి 5:**
కమాన్ పూర్ మండల కేంద్రంలో రాష్ట్ర, ఐ. టి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు అంబీరు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ సయీద్ అన్వర్ తో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ కో - అప్సన్ సభ్యులకు ఎం. డి ముస్తాక్ అహ్మద్ తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర.

- నియోజకవర్గ స్థాయిలో పట్టణ,మండల అధ్యక్షుల నియామకం.
- ఇన్నాళ్ల నిరీక్షణకు తెర.
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రణవ్ సూచన.
- పదవుల ప్రకటనతో కాంగ్రెస్ లో నయా జోష్.



**కబురు న్యూస్, హుజురాబాద్ జనవరి 5**



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హుజురాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్,జమ్మికుంట పట్టణ,మండల,వీణవంక,ఇళ్ళందకుంట మండలాల పార్టీ అధ్యక్షుల నియామకం ఆదివారం రోజున జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ,వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి,హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు నూతనంగా నియమించబడ్డ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు.హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మేకల తిరుపతి,మండల అధ్యక్షుడిగా కొల్లూరి కిరణ్ కుమార్,జమ్మికుంట పట్టణ అధ్యక్షుడిగా సుంకరి రమేష్,మండల అధ్యక్షుడిగా వీరమనేని పర్శరామరావు,వీణవంక మండల అధ్యక్షుడిగా ఎక్కటి రఘుపాల్ రెడ్డి,ఇళ్ళందకుంట మండల అధ్యక్షుడిగా పెద్ది కుమార్ లు నియమితులైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని,పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని,రాబోయే రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతీ ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామని,కార్యకర్తలను కపడుకుంటామని,ఎవరు అధైర్యపడొద్దని అందరికీ అవకాశాలు ఇస్తామని భరోసా ఇచ్చారు.గ్రామ స్థాయిలో పార్టీని బలపరచి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజురాబాద్ నుండి మెజారిటీ స్థాయిలో సీట్లు పొంది ముందుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి,హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వరి-స్వామిరెడ్డి,హనుమాన్ దేవాలయ చైర్మెన్ కొలిపాక శంకర్,జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య,సాహెబ్ హుస్సేన్,సొల్లు బాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పరిమళించిన మానవత్వం

## బ్రెయిన్ డెడ్ అయిన కానిస్టేబుల్ పెద్దోళ్ల ప్రశాంత్ రెడ్డి అవయవ దానానికి సహకరించిన కుటుంబ సభ్యులు

- అవయవదానం ద్వారా మరొక మనిషికి ప్రాణం పోయడం ఎంతో గొప్ప విషయంం
- సీపీ సుధీర్ బాబు ఐపీఎస్







**కబురు న్యూస్, మహేశ్వరం:రంగారెడ్డి జిల్లా, జనవరి 5,**
రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కందుకూరు పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తూ ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మరణించిన పెద్దోళ్ల ప్రశాంత్ రెడ్డి శరీర అవయవాలను కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో దానం చేశారు. తమ కుటుంబ సభ్యుడు ఇక లేరనే బాధలో ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న ఇతర ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చారు. డిసెంబర్ 28 వ తేదీన డ్యూటీ ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా రాత్రి పది గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తలకు బలమైన గాయాలు తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం మలక్ పేట యశోద ఆసుపత్రి తీసుకెళ్ళగా చికిత్స పొందుచూ శనివారం మరణించారు.ప్రశాంత్ రెడ్డి అవయవాలను తండ్రి రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ నాగిరెడ్డి, భార్య సౌమ్య జీవన్ దాన్ కు కిడ్నీలు, కాలేయం అప్పగించారు. తమ బిడ్డ ప్రాణం పోయిన బాధను తమ గుండెల్లో దాచుకుని కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు రావడాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఐపిఎస్ అభినందించారు. మృతుని కుటుంబాన్ని శాఖాపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఆర్గాన్ డొనేషన్ చేసిన వారు భౌతికంగా మరణించినప్పటికి జీవించి ఉన్నట్లేనని, అవయవదానం ద్వారా మరొక మనిషికి ప్రాణం పోయడం ఎంతో గొప్ప విషయం అని కమిషనర్ పేర్కొన్నారు. ఉప్పల్ లో ఆదివారం జరిగిన కానిస్టేబుల్ ప్రశాంత్ రెడ్డి అంత్యక్రియల ఖర్చులకు కమిషనర్ గారు 90 వేల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీ తరపున మహేశ్వరం ఏసిపి లక్ష్మికాంత రెడ్డి హాజరై ప్రశాంత్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఇన్స్పెక్టర్ సీతారాం, రాచకొండ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్ భద్రారెడ్డి, రాచకొండ కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ, బ్యాచ్ మెట్స్ తదితరులు పాల్గొన్నారు.

## కమాన్ పూర్ గ్రామ పంచాయతీని మేజర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి..!

**కబురు న్యూస్, రామగిరి జనవరి 5:**
కమాన్ పూర్ గ్రామ పంచాయతీని మేజర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఇది గ్రామ ప్రజల ఆకాంక్ష అను తెలియజేస్తూ.. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు ఆదివారం కమాన్ పూర్ మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా గ్రామ ప్రజల తరుపున వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంయిక్తంగా వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంతో పాటు సుమారు 350 మంది సంతకాల సేకరణతో మంత్రి శ్రీధర్ బాబు కి వినతి పత్రాన్ని అందజేశారు. చిన్న గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయని,. కమాన్ పూర్ గ్రామ పంచాయతీ నుండి ఇప్పటికే సిద్దిపల్లె, శాలపల్లె, బుర్రకాయల పల్లెలతో



సిద్దిపల్లె గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసి కమాన్ పూర్ గ్రామ పంచాయతీ విస్తీర్ణాన్ని కుదించడం జరిగిందన్నారు. మళ్ళీ మరోమారు కిష్టంపల్లె, బాపూజీ నగర్, పిల్లిపల్లె లతో కలిపి కిష్టంపల్లె నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లిన సందర్భంలో, కమాన్ పూర్ గ్రామపంచాయతీకి అనుకోని ఉన్న కిష్టంపల్లె ని గ్రామపంచాయతీ చేయడం వలన అనేక రకాల ఇబ్బందులు తలెత్తుతాయని, శ్రీధర్ బాబుకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో కుక్క చంద్రమౌళి, మచ్చగిరి రాము, జంగపల్లి శ్రీనివాస్, మల్లారపు అరుణ్ కుమార్, జంగపెల్లి అజయ్, పోతుల కుమార్ తదితరులున్నారు.

# సంక్రాంతికి ప్రేమలో పడతారా ?



కబురు సినిమా జనవరి 5:
కథల ఎంపికలో ప్రత్యేకతను చూపించే కథానాయిక నిత్యామేనన్.. తమిళ కథానాయకుడు జయం రవితో కలిసి 'కాదలిక్క నేరమిల్లై' అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమకథా చిత్రాన్ని కిరుతిగ ఉదయనిధి తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్లకు, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న థియేటర్లలోకి రాబోతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. "ఎంత వద్దనుకుంటే.. అంతగా ప్రేమలో పడతారు. మరి మీరు కూడా ఈ సంక్రాంతికి ప్రేమలో పడతారా? అయితే సిద్ధంగా ఉండండి" అని వ్యాఖ్యల్ని జోడించింది. రెడ్ జెయింట్ మూవీస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు, లాల్, వినయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం నిత్య జాబితాలో 'ఇడ్లీ కడై', 'డియర్ ఎక్స్‌సెస్' సినిమాలున్నాయి.




# పవన్ కల్యాణ్‌కు రామ్‌చరణ్ థాంక్స్

కబురు సినిమా జనవరి 5:
తన బాబాయ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు థాంక్స్ చెప్పారు నటుడు రామ్‌చరణ్ . 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్‌తో దిగిన ఫొటోలను ఆయన ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారు.. మీ తనయుడు, నటుడు, భారత పౌరుడిగా నేను మిమ్మల్ని ఎంతో గౌరవిస్తున్నాను. నా వెన్నంటే ఉన్నందుకు, నాకెప్పుడూ సపోర్ట్ చేస్తున్నందుకు ధన్యవాదాలు" అని పోస్ట్ పెట్టారు.'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ శనివారం సాయంత్రం రాజమండ్రిలో జరిగింది. పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రబృందానికి శుభాకాంక్షలు చెప్పారు. "రామ్‌చరణ్ మా బంగారం. ఒక తల్లికి పుట్టకపోయినా నా తమ్ముడు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండేవాడు. అద్భుత విజయాలు కలగాలని ఒక బాబాయిగా కాదు, అన్నగా ఆశీర్వదిస్తున్నా. లవ్ య్యూ రామ్‌చరణ్.. లవ్ య్యూ ఆల్" అని పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ వ్యాఖ్యలు అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రామ్‌చరణ్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'గేమ్ ఛేంజర్' . కియారా అద్వాణీ కథానాయిక. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా సినిమా సిద్ధమైంది. కార్తిక్ సుబ్బరాజు అందించిన కథతో శంకర్ ఈచిత్రాన్ని రూపొందించారు. రామ్‌చరణ్ ఇందులో రామ్‌నందన్, అప్పన్న అనే రెండు పాత్రల్లో నటించారు. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే అప్పన్న పాత్ర సినిమాకు కీలకంగా ఉండనుందని ఇప్పటికే టీమ్ ప్రకటించింది. అంజలి, శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న ఇది విడుదల కానుంది.

# వచ్చే నెల్లో ఆకాశంలో తార


కబురు సినిమా జనవరి 5:



గతేడాది 'లక్కీ భాస్కర్'గా సినీప్రియుల్ని అలరించారు దుల్కర్ సల్మాన్. ఇప్పుడాయన తెలుగులో మరో కొత్త చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. దుల్కర్.. దర్శకుడు పవన్ సాధినేనితో 'ఆకాశంలో ఒక తార' అనే పాన్ ఇండియా సినిమా చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. గీతా ఆర్ట్స్, లైట్ బాక్స్ మీడియా, స్వప్న సినిమా సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం ఫిబ్రవరి తొలి వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు సమాచారం. ఇదొక వైవిధ్యభరితమైన కథాంశంతో రూపొందనున్న సినిమా. దుల్కర్ మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీత దర్శకుడిగా, సుజిత్ సారంగ్ ఛాయాగ్రాహకుడిగా వ్యహరించనున్నట్లు తెలిసింది. కథానాయికగా సాయిపల్లవి పేరు పరిశీలనలో ఉంది. ఒకవేళ ఆమె డేట్లు సర్దుబాటు కాకుంటే మరో నాయికను తీసుకునే అవకాశముంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. దుల్కర్ సల్మాన్ తెలుగులో ఇప్పటికే 'కాంత' అనే ఓ సినిమా చేస్తున్నారు. ఇది చిత్రీకరణ దశలోనే ఉంది.

# బజూక ఆట

కబురు సినిమా జనవరి 5:
ప్రయోగాత్మక చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్న అగ్ర



ప్రయోగాత్మక చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్న అగ్ర కథానాయకుడు మమ్ముటి. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బజూక'. గేమ్ థ్రిల్లర్ నేపథ్యంలో డీనో డెన్నిస్ తెరకెక్కిస్తున్నారు. యోడ్లీ ఫిల్మ్స్, థియేటర్ ఆఫ్ డ్రీమ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా సినిమా ఫిబ్రవరి 14న విడుదల కానుందని తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోను పంచుకుంది చిత్రబృందం. 'ఆట మొదలైంది' అనే వ్యాఖ్యను జోడించింది. ఈ సినిమాలో గ్యాంగ్‌స్టర్ ఆటకట్టించే స్పై ఏజెంట్‌గా కనిపించనున్నారు మమ్ముటి. ఇందులో గౌతమ్ వాసుదేవ్ మేనన్, షైన్ టామ్ చాకో, సిద్ధార్థ్ భరతన్, గాయత్రి అయ్యర్, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# రిలీజ్ కి ముందే పుష్ప 2 ఆ రికార్డుని బ్రేక్ చేసిన గేమ్ ఛేంజర్..

కబురు సినిమా జనవరి 5:
టాలీవుడ్ స్టార్ హీరో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ అనే సినిమాలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో చరణ్ కి జంటగా బాలీవుడ్ బ్యూటిఫుల్ హీరోయిన్ కియారా అద్వానీ నటిస్తోంది. ఎస్జే సూర్య, సునీల్, శ్రీకాంత్, బ్రహ్మానందం, నవీన్ చంద్ర, సముద్రఖని అంజలి, తదితరులు ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. గేమ్ ఛేంజర్ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న రిలీజ్ కాబోతోంది. దీంతో గురువారం ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు.ఐతే ఈ ట్రైలర్ రిలీజ్ చేసిన 24 గంటల్లోనే దాదాపుగా 180 మిలియన్ వ్యూస్ వచ్చాయి. దీంతో టాలీవుడ్ లో 24 గంటల్లోనే అత్యధిక వ్యూస్ సాధించిన ట్రైలర్స్ లో గేమ్ ఛేంజర్ టాప్ లో నిలిచింది. అయితే ఇప్పటివరకూ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ట్రైలర్(102 మిలియన్ వ్యూస్) టాప్ లో ఉంది. కానీ గేమ్ ఛేంజర్ అంతకుమించి అత్యధిక వ్యూస్ తో టాప్ లో నిలిచింది. దీంతో రామ్ చరణ్ ఫ్యాన్స్ అనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కలెక్షన్స్ విషయంలో కూడా గేమ్ ఛేంజర్ రికార్డులు క్రియేట్ చేస్తుందని కామెంట్లు చేస్తున్నారు.





Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com